కళావిహీనం

శిథిలావస్థలో ముడసర్లోవ పార్కు

- పచ్చని కొండల మధ్య 20 ఎకరాల్లో విస్తరించిన సుందర వనం
- నగరవాసుల పిక్నిక్‌లు, సమావేశాలకు ఎంతో అనుకూలం
- గతంలో సినిమా షూటింగ్‌లు, సందర్శకులతో సందడి
- నిర్వహణ లోపంతో మూలకు చేరిన ఈత కొలను, ఆట పరికరాలు
- ఏళ్ల తరబడి పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



ముడసర్లోవ పార్కులో పిచ్చి మొక్కలతో నిండి శిథిలమైన వాటర్ ఫౌంటైన్



శిథిలమైన విశ్రాంతి షెల్టర్



ముడసర్లోవ రిజర్వాయర్ గట్టుపైకి శిథిలమైన మెట్ల మార్గం

ఆరిలోవ: నగరంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ముడసర్లోవ పార్కు జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. శిథిలావస్థకు చేరిన ఈ పార్కును ఏళ్ల తరబడి పట్టించుకోకుండా వదిలేశారు. బ్రిటిష్ కాలం నాటి ఈ పార్కులో ఒకప్పుడు ఎన్నో సినిమా షూటింగ్‌లు కూడా జరిగేవి. నిత్యం సందడిగా ఉండే ఈ పార్కు ఇప్పుడు వెలవెలబోతోంది. సుమారు పదమూడేళ్ల నుంచి పాలకులు, అధికారులు ఈ పార్కుపై కపట ప్రేమ చూపిస్తున్నారు తప్ప అభివృద్ధి చేయడం లేదు. దీన్ని సందర్శించిన అధికారులంతా ఇదుగో, అదుగో అభివృద్ధి చేసేస్తామంటూ కాలం వెళ్లదీస్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం పెట్టడం లేదు. రూ.50 కోట్లు, రూ.150 కోట్లతో అభివృద్ధి చేసేస్తామంటూ హామీలిచ్చి మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని ఊహా లోకం చూపిస్తున్నారు. అంతేతప్ప శిథిల పార్కుకు కొత్తదనం తీసుకొచ్చే అధికారి ఒక్కరూ కనిపించడం లేదు. దీంతో ఈ పార్కు సుమారు 13 ఏళ్లుగా శిథిలాలకే పరిమితమైంది. విశాలమైన ఈ పార్కు లోపలి నుంచి రిజర్వాయర్ గట్టు మీదకు చేరడానికి నిర్మించిన మెట్ల మార్గం కూడా శిథిలమైంది. దీని మెట్లు పలుచోట్ల ఊడిపోయి సందర్శకులు నడవడానికి వీలుకుండా మిగిలాయి. ఒకప్పుడు వేల మంది సందర్శకులతో నిత్యం కళకళలాడే ఈ పార్కు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఎవ్వరూ లేకపోవడంతో కళావిహీనంగా మారింది.

పంప్‌హౌస్‌లుగా శిథిల భవనాలు

ఒకప్పుడు ఈ పార్కులో సుందరంగా కనిపించే భవనాలు ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనని ఇక్కడకు వెళ్లిన సందర్శకులు భయపడుతున్నారు. ఈ భవనాలు ఒకప్పుడు అధికారులు, అతిథులకు విశ్రాంతినిచ్చేవి. ఇప్పుడు విష సర్పాలకు ఆవాసాలుగా మారాయి. ఇక్కడ ఉన్న భవనాలన్నీ శిథిలమవడం విశేషం. ఇక్కడ బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన భవనాలు కూడా ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లున్న భవనాల్లో ప్రస్తుతం జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు రెండింటిని పంప్ హౌస్‌లుగా వినియోగించుకుంటున్నారు. లోపల 20 హెచ్‌పీ, 60 హెచ్‌పీ నీటి పైపులు, పంప్ హౌస్‌కు సంబంధించిన మోటార్లు అమర్చారు. మరో భవనాన్ని వినియోగించడానికి సైతం వీలులేని విధంగా శిథిలమైంది. ఈ భవనాలను బ్రిటిష్ అధికారులు విశ్రాంతి కోసం నిర్మించారని స్థానికులు చెబుతున్నారు. విశాఖకు వచ్చిన బ్రిటిష్ అధికారులు వీటిలో విశ్రాంతి తీసుకునేవారట. వీటిని నిర్మించి సుమారు 100 ఏళ్లకు పైగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. పార్కు నిర్మించినప్పుడు సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్లు పూర్తిగా శిథిలమయ్యాయి. వీటిలో నీటిని పైకి విరజిమ్మే పైపులు విరిగిపోయాయి. వీటి అడుగు భాగాలు శిథిలమై ప్రస్తుతం పనిచేయకుండా మూలకు చేరాయి.

గడ్డితో నిండిపోయిన ఈత కొలను

ముడసర్లోవ పార్కులో సుమారు 1,000 చదరపు గజాల విస్తీర్ణంలో 1990లో స్విమ్మింగ్ పూల్ నిర్మించారు. అప్పట్లో ఇక్కడకు వచ్చే సందర్శకులు, స్థానికులు ఈత కొడుతూ గంటలు తరబడి గడిపేవారు. ఇప్పుడు అది పూర్తిగా మూలకు చేరింది. దీనిలో ఏపుగా గడ్డి పెరిగి స్విమ్మింగ్ పూల్‌ను మూసేసిందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటువైపు సందర్శకులు వెళ్లినా స్విమ్మింగ్ పూల్ ఉన్నట్లు ఆనవాలు కూడా కనిపించడం లేదు. దీన్ని ఆనుకుని మొసళ్ల కొలను ఉండేది. అందులోని మొసళ్లు సందర్శకులను అలరించేవి. ఇప్పుడు అది కూడా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీని పక్కనే వాటర్ ఫౌంటైన్ ఉండేది. దాని వద్ద నిత్యం సందర్శకులు సందడి చేసేవారు. అది కూడా శిథిలమై అస్తవ్యస్తంగా మారిపోయింది.

పార్కులో పిక్నిక్‌ల సందడి మాయం

కార్తీక మాసంలో నగరవాసులు పిక్నిక్ జరుపుకోవడానికి ముందుగా ముడసర్లోవ పార్కే గుర్తుకు వస్తుంది. నగరవాసులు, కులాలు, సంఘాలు, యూనియన్లు వనభోజనాలు జరుపుకుంటారు. ఇది అందరికీ అందుబాటులో ఉండడంతో నిత్యం సందర్శకులతో కళకళలాడేది. ఇక్కడకు వెళ్లిన సందర్శకులను అలరించడానికి పక్షుల గూళ్లు ఉండేవి. ఆ గూళ్లలో వివిధ రకాల పక్షులు అరుపులతో అలరించేవి. ఇప్పుడు పార్కులో ఒకప్పటి సందడి కానరావడం లేదు. ఇక్కడి విశాలమైన మైదానాలతోపాటు పిల్లల ఆటల కోసం పలు రకాల పరికరాలు అమర్చారు. అవన్నీ ఇప్పుడు తుప్పుపట్టి.. విరిగిపోయి.. నిరుపయోగంగా మారాయి. దీంతో ఇక్కడ పిల్లలు ఆటలాడలేని పరిస్థితి నెలకొంది. పక్షులు కూడా మాయమవడంతో వాటి గూళ్లన్నీ ఖాళీగా బోసిపోయాయి.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



చుట్టూ పచ్చని కొండల నడుమ ప్రశాంత వాతావరణంలో ఉన్న ముడసర్లోవ పార్కుపై అధికారులు నిర్లక్ష్యం చూపడం తగదు. నగరంలో పలుచోట్ల కొత్తగా పార్కులు నిర్మిస్తున్నారు. ఇక్కడ ఉన్న విశాలమైన పార్కును మాత్రం అభివృద్ధి చేయకుండా వదిలేస్తున్నారు. ఇది బ్రిటిష్ కాలంలో నిర్మించారని చెబుతారు. దీనిలో ఎన్నో సినిమా షూటింగ్‌లు కూడా జరిగాయి. ఇంతటి చరిత్ర కలిగిన పార్కును నిర్లక్ష్యంగా వదిలేయడం మంచిది కాదు.

– ఎం.వి.రావు, టి.ఐ.సి.పాయింట్

పార్కును అభివృద్ధి చేయాలి



ముడసర్లోవ పార్కులో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలన్నీ శిథిలమయ్యాయి. పిల్లల ఆట పరికరాలు తుప్పు పట్టి విరిగిపోయాయి. ఈ పార్కు చుట్టూ విశాలమైన రోడ్లు, పచ్చని కొండలున్నాయి. గతంలో దీని లోపలకు వెళ్తే ఎంతో ఆహ్లాదంగా ఉండేది. ఈ పార్కు వల్ల ఆరిలోవ ప్రాంతానికి మంచి పేరు కూడా వచ్చింది. అధికారులు దృష్టి సారించి అభివృద్ధి చేయాలి.

– ప్రకాష్, రామకృష్ణాపురం

గొడౌన్‌గా జీవీఎంసీ అతిథి గృహం

ముడసర్లోవ పార్కులో 1991లో అధికారులు అతిథి గృహం నిర్మించారు. నగరంలోని ప్రముఖులు, నగరానికి వచ్చే ముఖ్యులు ఈ అతిథి గృహంలో బస చేసేవారు. దీంతోపాటు ముఖ్యమైన నాయకుల అంతర్గత సమావేశాలు ఇక్కడ నిర్వహించేవారు. ఇప్పుడు ఈ భవనం అతిథులు ఉండడానికి వీలు లేకుండా తయారైంది. దీనిలోపల అంతా శిథిలావస్థకు చేరడంతో ముడసర్లోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది వారికి సంబంధించిన సామగ్రి, నీటి పైపులు వేసే గొడౌన్‌గా వినియోగించుకునే పరిస్థితి వచ్చింది.



శిథిలమై నిరుపయోగంగా మారిన అతిథి గృహం

క్లుప్తంగా

పరిశోధన పత్రాల సంకలనాలు ఆవిష్కరణ

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ (సీఎస్ఎస్ఐ) డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు సంపాదకత్వం వహించిన రెండు పుస్తకాలను (పరిశోధన పత్రాల సంకలనాలను) వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సోషల్ ఇన్‌క్లూజన్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ డిజెడ్వాంటేజ్ కమ్యూనిటీస్ ఇన్ ఇండియా ఆర్ఫో సెమినార్‌లో సమర్పించిన పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. మొదటి పుస్తకంలో 16 పరిశోధన పత్రాలు, రెండో పుస్తకంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యావేత్తలు, పండితులు సెమినార్‌లో సమర్పించిన 12 పత్రాలు ఉన్నాయని వీసీ రాజశేఖర్ తెలిపారు.

'మిస్ విశాఖ' పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: 'మిస్ విశాఖ 2025'పోటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిర్వాహకుడు అజయ్ అగర్వాల్ తెలిపారు. ఇప్పటికే వందకు పైగా దరఖాస్తులు వచ్చాయని, ఇంకా ఎక్కువ దరఖాస్తులు వస్తాయని ఆశిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో ఆడిషన్స్ నిర్వహిస్తామని, నవంబర్‌లో 'మిస్ విశాఖ 2025'గ్రాండ్ ఫినాలే జరుగుతుందని వివరించారు. నగరానికి చెందిన డాక్టర్ సృజన దేవి త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న 'మిస్ ఇండియా'పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఆమెను 'ఫరెవర్ మిస్ ఇండియా'కిరీటంతో సత్కరించామని, 'మిస్ విశాఖ'గా ఎంపిక కాలేదని స్పష్టం చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న సుజాత

మద్దిలపాలెం : పోక్సో చట్టంపై స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహన కల్పించామని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. చట్టంలోని అంశాలపై ద్వారకా సబ్ డివిజన్ పోలీసు సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ఈ చట్టంపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. సౌకల్య స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో నిర్వహించిన సదస్సులో ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై కేసు

ఎంవీపీ కాలనీ : ఇసుకతోట వద్ద స్నేహితుడి రూమ్‌లో బొండాపల్లి రమేష్ (28) అనే యువకుడు మృతి చెందిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక సమీప మింది ప్రాంతానికి చెందిన రమేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గతంలో సీతమ్మధారలోని ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేసిన రమేష్ ఇటీవల మానేశాడు. వైద్యులు మద్యానికి దూరంగా ఉండాలని సూచించినా వినలేదు. ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ అంబులెన్స్ డ్రైవర్ అయిన స్నేహితుడు లక్ష్మణ్ రూమ్‌లో 10 రోజులుగా ఉంటూ మద్యం సేవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 31న ఉదయం అపస్మారక స్థితిలో ఉండడంతో లక్ష్మణ్ తన స్నేహితురాలు అనూషకు తెలియజేశాడు. ఆమె వచ్చి చూసేసరికి రమేష్ నుంచి స్పందన లేకపోవడంతో ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించగా అప్పటికే రమేష్ మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై రమేష్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరుగుదొడ్ల ఏర్పాటుకు వినతి

మద్దిలపాలెం : స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్, యువజన, విద్యార్థి మహిళా సమాఖ్య నాయకులు వై.రాంబాబు, యు.నాగరాజు, వనజాక్షి డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థులు 2 వేల మందికి పైగా ఉన్నారని... వారందరికీ మరుగుదొడ్లు సరిపడక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అమ్మాయిల మరుగుదొడ్లలో వేరే కళాశాలకు చెందిన కంప్యూటర్ పరికరాలు ఏర్పాటు చేయడంతో వారు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని, కొత్తగా మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిర్వహణ సరిగా లేక ప్రస్తుతమున్న మరుగుదొడ్లు కూడా అపరిశుభ్రంగా తయారయ్యాయని ఆరోపించారు. అచ్యుత్, మధురెడ్డి, ప్రకాష్, కెల్ల రమణ, అభిషేక్ పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం



ఆదర్శనగర్‌లో యువకుడికి కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ : ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వ మోసాలను వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి తెలియజేశారు. జీవీఎంసీ పదో వార్డులో సోమవారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మోసాలపై ముద్రించిన కరపత్రాలను పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు గడప గడపకు వెళ్లి ప్రజలకు అందజేశారు. ప్రస్తుతం కూటమి పాలనలో అందని సంక్షేమ పథకాలు, ప్రజా వ్యతిరేక పాలన, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చేస్తున్న మోసాన్ని అందరికీ వివరించారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాసరావు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వైదా నారాయణరావు, ఇట్ల వరలక్ష్మి, ఒమ్మి శ్రీను, కనకల కృష్ణ, పతివాడ వెంకటలక్ష్మి, రాధ, వీరమ్మ, దేవి, జయశ్రీ పాల్గొన్నారు.

విద్యకు దూరం కాకుండా చూడాలి



ఆచార్య అమృతవల్లిని సత్కరిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్, ఆచార్య షారోన్‌రాజు

మద్దిలపాలెం: ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యకు వెళ్లే క్రమంలో బడి మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని ఎన్‌సీటీఈ–ఆర్‌సీఐ ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యురాలు, ఆచార్యురాలు డాక్టర్ టి.జి.అమృతవల్లి పిలుపునిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఆర్ఈ శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమృతవల్లి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగ) విద్యార్థులు కూడా సాధారణ విద్యార్థులతో కలిసి చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల్లో దివ్యాంగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులు వారి అభ్యాసన స్థాయిని నిరంతరం గమనించాలని కోరారు. చదవడం, రాయడం, ప్రాథమిక గణిత అంశాలపై విద్యార్థులకు పట్టు ఉండేలా చూడాలని వివరించారు. ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ చిన్నారులందరికీ సమాన అవకాశాలు అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పాఠశాల విద్య విభాగం ఆర్జేడీ వి.విజయభాస్కర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం జాతీయ విద్యా విధానం రూపొందించబడిందని, మండలానికి ఒక ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేస్తే వారి అవసరాలకు అనుగుణంగా విద్య అందించవచ్చని తెలిపారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య షారోన్ రాజు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో దివ్యాంగులకు బోధించేటప్పుడు ఎదురైన సమస్యలను తెలియజేస్తే, వాటిని ఆర్‌సీఐ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు.

తీరంలో కుప్పలుగా వినాయక పూజా సామగ్రి



జోడుగుళ్లపాలెం తీరంలో పూజా సామగ్రి తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు



జోడుగుళ్లపాలెం తీరం నుంచి డంపింగ్‌యార్డుకు పూజా సామగ్రి తరలిస్తున్న లారీలు

ఆరిలోవ : సముద్ర తీరంలో పూజా సామగ్రి కుప్పలుగా పేరుకుపోతోంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సముద్ర తీరంలో గణపతి ప్రతిమల నిమజ్జనాలు జరుగుతున్నాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జోడుగుళ్లపాలెం, రుషికొండ బీచ్‌లో నిమజ్జనాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం జోడుగుళ్లపాలెం తీరంలో అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు. మండపాల వద్ద ఇన్ని రోజులు చేసిన పూజల్లో భాగంగా చేరిన పూలు, పత్రి, ఆకులు, సామగ్రిని కూడా విగ్రహంతోపాటు నిమజ్జనం చేస్తున్నారు. ఆ సామగ్రి సముద్ర కెరటాల ఉధృతికి కొంత సేపటికి ఒడ్డుకు చేరిపోవడంతో తీరమంతా అస్తవ్యస్తంగా మారిపోతోంది. దీంతో సోమవారం ఉదయం జీవీఎంసీ తొమ్మిదో వార్డు పారిశుధ్య కార్మికులు తీరంలో చేరిన పత్రి, పూజ సామగ్రి తొలగించి కుప్పలుగా వేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆ కుప్పలను వెంటనే లారీలతో డంపింగ్‌యార్డుకు తరలించి శుభ్రం చేయించారు.

సివిల్స్ పరీక్షలకు ప్రిపరేషన్‌పై వర్క్‌షాప్



అనిరుధ్ బిల్లాని సత్కరిస్తున్న నరసింహారావు, తదితరులు

మద్దిలపాలెం : ప్రఖ్యాత టెడ్ఎక్స్ స్పీకర్, లైఫ్ కోచ్ అనిరుధ్ బిల్లా ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగంలో సివిల్ సర్వీసెస్‌కు ప్రిపరేషన్‌పై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిరుధ్ మాట్లాడు తూ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సంబంధించిన విలువైన సమాచారం అందించారు. పరీక్షలకు అనుసరించాల్సిన వ్యూహాలు, సమయ నిర్వహణ పద్ధతులు తెలిపారు. అనంతరం ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులకు మార్గదర్శకంగా ఇటువంటి సెషన్లు నిలుస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెలేటి ప్రేమానందం మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అవసరమైన సమాచారం అందించారు.

వర్క్‌షాప్ పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ట్రాన్స్‌లేషనల్ మెడిసన్ ఇన్ క్యాన్సర్ (టీఎంసీ – 2025) అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ అక్టోబర్ 27, 28న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య పి.రాధిక, ఆచార్య రాఘవరావు, డీన్ కె.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద అన్నసమారాధనలు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న మొల్లి అప్పారావు, తదితరులు



అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, కమిటీ సభ్యులు, నాయకులు



22వ వార్డు రజకవీధిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్, తదితరులు

ఎంవీపీ కాలనీ : నియోజకవర్గంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 17వ వార్డులో అన్నసమారాధన చేశారు. స్థానిక యూత్ ఆధ్వర్యంలో గణేషుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 6 రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ప్రారంభించారు. ముందుగా గణేషుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్, వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి, తూర్పు యూత్ అధ్యక్షుడు రవికిరణ్ రెడ్డి, గణేష్ రెడ్డి, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 16, 23వ వార్డుల్లో సోమవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి, చొల్లంగి నాగేశ్వరరావు, తూర్పు సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, ఎండ్రెడ్ల ఈశ్వరరెడ్డి, గుడ్ల నర్సింగరావు, మీసాల ప్రదీప్, చింతా వెంకటరావు, బోరా రామిరెడ్డి, సరగడ భూలోక రెడ్డి, పిన్నింటి నరసింగరావు, బోయి రమణారెడ్డి, అవ్వ నర్సింగరావు రెడ్డి పాల్గొన్నారు.

జీవీఎంసీ 22వ వార్డు రజకవీధిలో సోమవారం నిర్వహించిన అన్నదానాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్ ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. స్థానిక యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న ముచ్చల సురేష్, తదితరులు



అన్నసమారాధనలో మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్

బీచ్‌రోడ్డు : వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 20వ వార్డులోని వాల్తేరు బెస్ట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సోమవారం మహా అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వినాయక మండపాలు వద్ద అన్న సమారాధనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి టి.ఐ.సి పాయింట్ వద్ద విఘ్నేష్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నసమారాధన చేపట్టారు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొని విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పీతల అప్పాజి, చందు పాల్గొన్నారు.

సంతృప్తికరంగా సేవలు అందించా

ఏయూ రిజిస్ట్రార్‌గా పనిచేయడం గర్వకారణం



ఆచార్య ధనుంజయరావును సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా ఏడాది కాలం పాటు సేవలందించడం ఎంతో గర్వకారణమని, ఈ అవకాశం తనకు కల్పించిన వీసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆచార్య ఇ.ఎస్ ధనుంజయరావు అన్నారు. రిజిస్ట్రార్‌గా రిలీవ్ అవుతున్న ఆయనకు అకడమిక్ సెనెట్ మందిరంలో సోమవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ధనంజయరావు మాట్లాడుతూ ఏడాది కాలం రిజిస్ట్రార్ సంతృప్తికరమైన సేవలు అందించానని చెప్పారు. ఈ సమయంలో ఎంతో నేర్చుకున్నానని, ఎన్నో సవాళ్లతో కూడుకున్న బాధ్యతగా రిజిస్ట్రార్ పదవి నిలుస్తుందని చెప్పారు. ఏయూ వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ రిజిస్ట్రార్‌గా కొనసాగాలని ధనుంజయరావును తాను కోరానని... అయినా రిలీవ్ కావాలని భావించడంతో తప్పనిసరి పరిస్థితులలో వీడ్కోలు పలకాల్సి వస్తోందన్నారు. మంచి పరిపాలనదక్ష్యుడిగా ధనుంజయరావు నిలుస్తారని కొనియాడాను. రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వెలకట్టలేని సేవలను ధనుంజయరావు అందించాలని కొనియాడారు. ధనుంజయరావును వీసీ రాజశేఖర్ సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, డి.నగరాజాకుమారి, ఆర్.పద్మశ్రీ. ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్ ఆచార్య కె.రాంబాబు, అకడమిక్ డీన్ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.